క్లుప్తంగా

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్‌: మండలంలోని భట్‌పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం షీటీం సభ్యులు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సభ్యులు రమాదేవి, సునీత మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్‌, సైబర్‌క్రైం నేరాలకు ఎవరైనా గురైతే వెంటనే షీటీం సభ్యులను సంప్రదించాలన్నారు. మహిళల రక్షణ కోసమే షీటీంలు పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధాబాయి, తదితరులు పాల్గొన్నారు.

పార్థివదేహానికి కోనప్ప నివాళి


నివాళులర్పిస్తున్న కోనేరు కోనప్ప

బెజ్జూర్‌: మండలంలోని కుకుడా గ్రామానికి చెందిన కోనేరు కోనప్ప కార్యకర్త పెద్దల కైలాస్‌ ఆకస్మికంగా మృతిచెందగా సిర్పూర్‌ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

నాటుసారా స్థావరాలపై దాడులు


బైండోవర్‌ చేస్తున్న అధికారులు


చింతలమానెపల్లి: మండలంలోని లంబడిహెట్టి, రణవెల్లి, చింతలమానెపల్లి, దిందా, గూడెం గ్రామాల్లో మంగళవారం అబ్కారీ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 20 లీటర్ల నాటుసారా, 40 దేశీదారు బాటిళ్లను పట్టుకున్నారు. ముగ్గురిపై కేసులు నమోదు చేసి తహసీల్దార్‌ మునావర్‌ షరీఫ్‌ వద్ద బైండోవర్‌ చేశారు. నాటుసారాతో జీవితాలు నాశమవుతాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అబ్కారీ శాఖ సీఐ రవి, అక్బర్‌ హుస్సెన్‌, ఎస్సైలు సురేశ్‌, రాజేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పత్తి దగ్ధం


కాలిపోయిన పత్తి

కౌటాల: మండలంలోని గురుడుపేట గ్రామం మేకల తిరుపతికి చెందిన నాలుగు క్వింటాళ్ల పత్తి మంగళవారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం .. ఇంటి వద్ద బొలెరో వాహనంలో పత్తి నింపుతుండగా విద్యుత్‌ సరఫరా తీగలు పత్తికి తగిలి మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు నీళ్లు చల్లి మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో 4 క్వింటాళ్ల పత్తి దగ్ధమైందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. గ్రామంలో విద్యుత్‌ సరఫరా తీగలు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు ఆరోపించారు.

ప్రయాగ్‌రాజ్‌కు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు


కుంభమేళాలో స్నానం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల: ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమ ఘాట్‌లో రథసప్తమి సందర్భంగా కుంభమేళాలో మంగళవారం పుణ్యస్నానం ఆచరించినట్లు సిర్పూర్‌ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. కుంభమేళాలో ప్రత్యేక పూజలు చేసినట్లు తెలిపారు. సిర్పూర్‌ ప్రాంత ప్రజలు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని పూజలు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ఇంటర్‌ తర్వాత ఇంటికే..!

- ముందుకు సాగని ఉన్నత చదువులు
- తపన ఉన్నా సౌకర్యం లేదు
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



కౌటాల ప్రభుత్వ జూనియర్‌ కళాశాల నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు (ఫైల్‌)

కౌటాల: మండలంలోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల పిల్లలకు ఉన్నత విద్య అందని ద్రాక్షలాగా మారింది. చదువుకోవాలని తపన ఉన్నా.. అనుకూలించని పరిస్థితుల వల్ల మండల విద్యార్థులు ఇంటర్‌ విద్య తర్వాత ఉన్నత చదువుకు స్వస్తి పలుకుతున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో మండలంలోని ఎంతో మంది విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరు దూర ప్రాంతాలకు వెళ్లి ఉన్నత విద్య చదవలేక విద్యార్థినులు ఇంటికే పరిమితమవుతున్నారు.

తప్పని దూరభారం

జిల్లాలోని కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్‌, పెంచికల్‌పేట్‌, సిర్పూర్‌(టి) మండలాల్లోని ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. కౌటాల మండలంతో పాటు చింతలమానెపల్లి, పెంచికల్‌పేట్‌, సిర్పూర్‌(టి), బెజ్జూర్‌ మండలం నుంచి ఎంతో మంది విద్యార్థులు ప్రతినిత్యం ఇంటర్‌ విద్య అభ్యసించేందుకు కౌటాల మండల కేంద్రానికి రోజూ వస్తుంటారు. మండలంలో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఉన్నప్పటికీ ఇంటర్మీడియెట్‌ విద్య పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలంటే ప్రైవేట్‌ విద్య సంస్థలో చదవడం ఆర్థికంగా భారంగా మారింది. దీంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక ఇళ్ల వద్దనే కాలం వెళ్లదీస్తున్నారు. కౌటాలలో ఉన్న ప్రైవేట్‌ డిగ్రీ కళాశాలలో మధ్య తరగతి, ఆర్థికంగా బాగున్న వారి పిల్లలు మాత్రమే ఫీజులు చెల్లిస్తూ ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు.

అందని ఉన్నత విద్య..

ఆయా మండలంలో సుమారు ప్రతి ఏడాది వందల మంది విద్యార్థులు ఇంటర్‌ సెకండియర్‌ పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదవాలంటే విద్యార్థులు 60 కిలో మీటర్ల దూరంలోని కాగజ్‌నగర్‌, 100 కిలోమీటర్ల దూరంలోని ఆసిఫాబాద్‌ పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దూర భారం కారణంగా నిరుపేద విద్యార్థులు అక్కడికి వెళ్లలేక పోతున్నారు. కౌటాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే ఐదు మండలాల్లోని ఎంతో మంది నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్య చదువుకునే అవకాశాలు ఉన్నాయని మండలవాసులు పేర్కొంటున్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎప్పుడో..

రాష్ట్ర ప్రభుత్వం కౌటాల మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే తమ కష్టాలు తీరుతాయని విద్యార్థులు ఆశిస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని గతంలో బీసీ సంఘంతో పాటు పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కౌటాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

దూరంగా ఉన్నత విద్య



కౌటాల మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. స్థానికంగా డిగ్రీ కళాశాల లేక చాలా మంది గ్రామీణ ప్రాంత విద్యార్థులు దూరప్రాంతాల్లోని పట్టణాలకు వెళ్లి పార్ట్‌టైం ఉద్యోగం చేసుకుంటూ చదువుకుంటున్నారు. కొంతమంది విద్యార్థినులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు.

\- నందిని, విద్యార్థిని, కౌటాల

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



నేను ప్రస్తుతం కౌటాల ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ సెకండియర్‌ చదువుతున్నాను. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక ఎంతో మంది ఇంటర్‌తో చదువు ఆపేస్తున్నారు. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి.

\- అజయ్‌, విద్యార్థి, కౌటాల

ఆర్థిక భారం పడుతోంది



గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టణాలకు వెళ్లకుండా మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక పిల్లలను దూర ప్రాంతంలో చదివించడం ఆర్థిక భారంగా మారుతోంది. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించాం.

\- పెద్దపెల్లి వెంకటేశం, కౌటాల

ప్రోత్సాహకాలతో ఉద్యోగుల్లో నూతనోత్సాహం


బహుమతులు అందజేస్తున్న జీఎం శ్రీనివాస్‌

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బొగ్గు ఉత్పత్తి సాధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు యాజమాన్యం ప్రవేశపెట్టిన ప్రత్యేక ప్రోత్సాహకాల పథకంతో ఉద్యోగుల్లో నూతనోత్సాహం కనిపిస్తోందని బెల్లంపల్లి ఏరియా జనరల్‌ మేనేజర్‌ ఎం. శ్రీనివాస్‌ అన్నారు. మంగళవారం ఏరియాలోని కైరిగూడ ఓసీపీలో ప్రత్యేక ప్రోత్సాహక పథకంపై ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని నింపి ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం సంస్థ ప్రత్యేక ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. బెలంపల్లి ఏరియాకు నిర్దేశించిన 37.50 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించేందుకు ఏరియాలో పని చేస్తున్న ప్రతీ ఉద్యోగి కృషి చేయాలన్నారు. ప్రత్యేక ప్రోత్సాహక పథకం ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాన్ని చేకూర్చడంతో పాటు సంస్థ మనుగడకు మరింత బలోపేతం చేస్తుందన్నారు. రానున్న 55 రోజుల్లో ఉద్యోగులు విధులకు గైర్హాజరు కాకుండా చూసుకోవాలన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధనతో ఏరియాను అగ్రగామిగా నిలపాలని పేర్కొన్నారు. జనవరిలో అత్యధిక బొగ్గు ట్రిప్పులు నడిపిన షావల్‌, డంపర్‌ ఆపరేటర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి నరేందర్‌, ఇన్‌చార్జి ప్రాజెక్టు ఇంజనీరు నరేశ్‌, మేనేజర్‌ శంకర్‌, సేఫ్టీ అధికారి నారాయణ, డీవైపీఎం వేణు, ఏఐటీయూసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

‘చలో హైదరాబాద్‌’ విజయవంతం చేయాలి


దప్పు ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

ఆసిఫాబాద్‌: ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమానికి చలో హైదరాబాద్‌ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిర్పూర్‌(టి)మండల ఎమ్మార్పీఎస్‌ నాయకులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌ ప్రాంతం చౌరస్తా నుంచి ప్రధాన రహదారి గుండా డప్పు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని డిమాండ్‌ చేస్తూ ఈనెల 7న నిర్వహించే లక్షడప్పులు, వెయ్యి గొంతుకల బహిరంగ సభ విజయవంతం చేయాలని, కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్‌ నాయకులతో పాటు కుల సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పట్టణంలో డప్పు ప్రదర్శనతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ నాయకులు చంద్రగిరి సుదర్శన్‌, ఇప్ప అశోక్‌, చంద్రగిరి రవీందర్‌, రాజయ్య, నానయ్య, నాగేశ్‌, మధుకర్‌, ప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో మొక్కలు నాటాలి

కాగజ్‌నగర్‌రూరల్‌: ప్రతీ ఇంట్లో మొక్కలు నాటుకోవాలని భట్‌పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనురాధాబాయి అన్నారు. మంగళవారం భట్‌పల్లి జిల్లా పరిషత్‌ సెకండరీ పాఠశాలలో నేషనల్‌ గ్రీన్‌ కార్ప్స్‌ (ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ చెట్లు ప్రాణవాయువునిస్తాయని, ఆరోగ్యంగా ఉండాలంటే మన పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్లాస్టిక్‌ వినియోగాన్ని సైతం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీసీ ఇన్‌చార్జి, ఉపాధ్యాయుడు శాంతికుమార్‌, రావూఫ్‌, ఆనంద్‌బాబు, నర్మద, నరేందర్‌గౌడ్‌, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


విద్యార్థితో చదివిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్‌

కెరమెరి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో ఆడే ప్రకాశ్‌ అన్నారు. మంగళవారం మండలంలోని రింగన్‌ఘాట్‌ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. విద్యార్థులతో చదివించారు, రాయించారు. సామర్థ్యాల ఆధారంగా విద్యాబోధన చేయాలన్నారు. రెండో తరగతి నుంచి పైతరగతుల విద్యార్థులు తెలుగు, ఆంగ్లంలో ధారాళంగా చదవగలగాలని, చతుర్విధ ప్రక్రియలు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ పాటించాలని, ప్రతీ వారంలో మూడు గుడ్లు ఇచ్చేలా చూడాలన్నారు. టీచర్‌ సుర్పం కిషన్‌ ఉన్నారు.

అవార్డు అందుకున్న ఎంఈవోకు సన్మానం


బెజ్జూర్‌: సునీతను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

బెజ్జూర్‌: వెల్‌ ఎడ్యుకేషనల్‌ అండ్‌ పీస్‌ కౌన్సిల్‌ డాక్టరేట్‌ అవార్డును న్యూఢిల్లీలో అందుకున్న ఎంఈవో చంకోట్‌ సునీతను తెలంగాణ టీచర్స్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మంగళవారం బెజ్జూర్‌ ఉన్నత పాఠశాలలో శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ టీచర్స్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ ఖమర్‌ మాట్లాడుతూ డాక్టరేట్‌ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీఆర్పీ ఏలేశ్వరం శ్రీనివాస్‌, ఉపాధ్యాయులు పూణేశ్‌ శ్యామ్‌, సంతోష్‌, రమేశ్‌ బాబు, ఇందిరా, విష్ణు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాండ్రె విశాల్‌కు సన్మానం


ఆసిఫాబాద్‌అర్బన్‌: సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: రాష్ట్ర టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు ఖాండ్రె విశాల్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. మాజీ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్‌, ఎస్సీ సెల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్‌లు మాట్లాడుతూ విశాల్‌ గత కొన్నేళ్లుగా పార్టీ ఎదుగుదలకు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు మంగ పెంటయ్య, ప్రసాద్‌గౌడ్‌, సత్యనారాయణ, ఈదులవాడ గణేశ్‌, వెంకన్న, శ్రీకాంత్‌, దీపక్‌, సిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందించాలి


లింగాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏపీఎం తిరుపతి

లింగాపూర్‌: పిల్లలకు పౌష్టికాహారం అందించాలని ఏపీఎం తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లల్లో పోషణ లోపం తగ్గించడం, నివారించడంపై మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో రామచందర్‌ సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీవో రజనీకాంత్‌, ఐకేపీ సీసీ కైలాశ్‌, ప్రదీప్‌, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్‌ జాబితాపై సమావేశం


వాంకిడి: మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌ కుమార్‌

పెంచికల్‌పేట్‌: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవో అల్బర్ట్‌ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పంచాయతీల్లో నూతనంగా నమోదైన ఓటర్లు, వార్డుల వారీగా వివరాలను తెలియజేశారు. కొత్తగా మరో ఎంపీటీసీ స్థానం పెరిగిందన్నారు. ఎన్నికల కోడ్‌ అమల్లో ఉన్న నేపథ్యంలో నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో బీజేపీ, కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షులు రాజేశ్వర్‌, బండు, బిట్టి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌: సిర్పూర్‌(టి) మండలంలోని నూతన ఓటరు జాబితా మార్పులు, చేర్పుల వివరాలపై మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని ఎంపీడీవో సత్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో ప్రవీణ్‌ కుమార్‌ సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా మార్పులు, చేర్పులు చేసిన ఓటరు లిస్టుపై నాయకులకు అవగాహన కల్పించారు. జాబితాలో ఎలాంటి తప్పిదాలు ఉన్నా పరిశీలించి తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీ తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

లింగాపూర్‌: మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో సర్పంచ్‌, వార్డు సభ్యుల ఎన్నికల సప్లిమెంటరీ ఓటరు జాబితాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ఎంపీడీవో రామచందర్‌ సమావేశం నిర్వహించారు. ఎంపీవో రజనీకాంత్‌, వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.


పెంచికల్‌పేట్‌: మాట్లాడుతున్న ఎంపీడీవో అల్బర్ట్‌


సిర్పూర్‌ (టి)లో..


లింగాపూర్‌లో..

పత్తి వ్యాను బోల్తా

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ప్రధాన రహదారిపై మంగళవారం మధ్యాహ్నం పత్తి వ్యాన్‌ బోల్తా పడిన సంఘటన చోటు చేసుకొంది. వివరాల్లోకి వెళ్తే చింతలమానెపల్లిలోని నూకల మొండయ్య అనే వ్యాపారికి చెందిన పత్తి వ్యాన్‌ను డ్రైవర్‌ పోచయ్య ఆదిలాబాద్‌ ఎక్స్‌రోడ్డు వద్ద గల జిన్నింగ్‌ మిల్లుకు తీసుకెళ్తున్న క్రమంలో అదుపుతప్పడంతో ఒక్కసారిగా బ్రేకులు వేయగా అక్కడికక్కడే పల్టీ కొట్టింది. అధిక లోడుతో పాటు డ్రైవర్‌ నిర్లక్ష్యం కూడా ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. ప్రధాన రహదారి అయినప్పటికీ ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

వైద్యం కోసం విరాళాలు అందజేత


విరాళాలు సేకరిస్తున్న విలాస్‌, నాయకులు

కౌటాల: అనారోగ్యంతో బాధపడుతున్న ఆదివాసీ మహిళకు మండల కేంద్రంలోని దుకాణదారులు మంగళవారం కొంత మొత్తం విరాళాలు అందజేశారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కనికి గ్రామానికి చెందిన ఆదివాసీ బర్ల విలాస్‌ భార్య అమృత అనారోగ్యంతో ఈ నెల 1న కరీంనగర్‌లోని ప్రైవేట్‌ ఆసుపత్రిలో చేరింది. ఊపిరితిత్తుల్లో నీరు చేరిందని, వెంటనే ఆపరేషన్‌ చేయాలని, అందుకు రూ.6 లక్షల ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో భర్త విలాస్‌ మండల కేంద్రంలో మన్నెవార్‌ కొలావార్‌ సంఘం నాయకులను కలిసి తమ పరిస్థితి చెప్పుకోగా దుకాణదారులు కొంతమేర విరాళాలు అందజేశారు. కూలీ చేసుకుని బతికే తమ వద్ద చిల్లి గవ్వలేదని దాతలు ఆదుకోవాలని విలాస్‌ వేడుకుంటున్నాడు.

ప్రారంభమైన యాసంగి డిజిటల్‌ సర్వే


వివరాలు అప్‌లోడ్‌ చేస్తున్న ఏవో

దహెగాం: మండల కేంద్రంతో పాటు గిరవెల్లి గ్రామంలో మంగళవారం యాసంగి పంటల సాగు డిజిటల్‌ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో రామకృష్ణ మాట్లాడుతూ రైతులు యాసంగిలో సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. రైతులు సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను సంబంధిత ఏఈవోలకు తెలియజేయాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించి దిగుబడి సాధించాలన్నారు. ఆయన వెంట ఏఈవోలు వంశీ, సుష్మిత, రైతులు పాల్గొన్నారు.